సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సరళాహన్మంతరెడ్డి

సమన్వయంతో పని చేసి సమస్యలు పరిష్కరించాలి

- ఎంపీపీ సరళాహన్మంతరెడ్డి

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 4 : అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. యాసంగి సాగు చేసిన రైతుల పంటలను వ్యవసాయశాఖ అధికారులు పరిశీలించి తగిన సూచనలు అందించాలని, చలికాలంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా వైద్యాధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి సరిత మాట్లాడుతూ ప్రస్తుతం సాగర్ రిజర్వాయర్‌లో సరిపడా నీరు లేనందున రైతులు నీటి సమస్యను దృష్టిలో ఉంచుకొని యాసంగిలో ఆరుతడి పంటలను సాగు చేసేలా ప్రజాప్రతినిధులు అవగాహన కల్పించాలని సూచించారు. శుద్ధి చేసిన విత్తనాలను పీఏసీఎస్‌లలో అందుబాటులో ఉంచామని, కావాల్సిన రైతులు తీసుకోవచ్చని వెల్లడించారు. అంతకు ముందు సర్పంచులు తమ గ్రామ సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. వాటిపై అధికారులు వెంటనే స్పందించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణ, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, వివిధ శాఖల అధికారులు, స్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రైతుబంధు సమితి జిల్లా అధ్యక్ష పదవికి చింతరెడ్డి రాజీనామా

మిర్యాలగూడ రూరల్, డిసెంబర్ 4 : రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తన పదవికి మంగళవారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని రాష్ట్ర అగ్రికల్చర్ కమిషనర్, సెక్రటరీ రఘు నందన్‌రావుకు పంపినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో చోటు చేసుకున్న రాజకీయ పరిణామాల దృష్ట్యా తన పదవికి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. బీఆర్ఎస్ రైతుల పక్షాన నిలిచిందని పేర్కొన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ అమలు చేసిన పథకాలు, అనుసరించిన విధానాలతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు.

ఆర్థిక సాయం

చిట్యాల, డిసెంబర్ 4 : మండలంలోని వెలిమినేడు గ్రామానికి చెందిన చిర్రగోని బక్కమ్మ ఇటీవల మృతి చెందాడు. అదే గ్రామానికి చెందిన అంతటి పారిజాతానర్సింహ సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతురాలి కుటుంబ సభ్యులకు రూ. 5వేలు అందజేశారు. సర్పంచు దేశబోయిన మల్లమ్మ, సత్తిరెడ్డి, అంతటి రాజు, కాటం సత్తయ్య పాల్గొన్నారు.

యాసంగిలో రైతులు ఆరుతడి పంటలు సాగు చేసుకోవాలి

- ఏఓ అర్చన

అడవిదేవులపల్లి, డిసెంబర్ 4 : యాసంగి సీజన్‌లో రైతులు వరికి బదులుగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని ఏఓ అర్చన సూచించారు. సోమవారం మండల కేంద్రలో విలేకరులతో మాట్లాడారు. నీటి వసతి లేని రైతులు ఆరుతడి పంటలైన వేరుశెనగ, మినుములు, పెసర్లు, బొబ్బెర్లు వంటి స్వల్పకాలిక రకాలను సాగు చేసుకోవాలన్నారు. బోరుబావుల కింద నీటి వసతి కలిగిన రైతులు వరి సాగు చేసుకోవచ్చని తెలిపారు. ఆరుతడి పంటలను సాగు చేయడం వల్ల భూసారం కూడా పెరుగుతుందని, పంటలు బాగా పండి అధిక దిగుబడులు వస్తాయని ఆమె పేర్కొన్నారు. యాసంగి సీజన్‌కు రైతులకు కావాల్సిన అన్ని రకాల విత్తనాలు మండల కేంద్రంలోని

డీలర్ల వద్ద అందుబాటులో ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

బీఆర్ఎస్ నాయకులు ప్రజలకు అండగా నిలువాలి

- పదేండ్లపాటు నియోజకవర్గ ప్రజల సంక్షేమానికి కృషి చేశా
- మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

మిర్యాలగూడ, డిసెంబర్ 4 : బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోనే ఉంటూ వారికి ఎల్లవేలలా అండగా నిలువాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సూచించారు. సోమవారం పట్టణంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ పట్టణస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. పదేండ్లపాటు అధికారంలో ఉండి అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందించామన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత చేసే అభివృద్ధిపై బీఆర్ఎస్ శ్రేణులు దృష్టిసారించాలని, వారి వైఫల్యాలను ఎప్పటికప్పుడు ప్రజలతో కలిసి ఎండగట్టాలని సూచించారు. ఓటమితో కుంగిపోకుండా ముందుకు సాగాలని సూచించారు. తాను స్థానికంగా ఉంటూ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఎల్లవేళలా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. మిర్యాలగూడ నియోజకవర్గం, మండల, గ్రామస్థాయి నాయకులందరూ ఎప్పటి లాగానే పార్టీ పటిష్టత కోసం పనిచేయాలని కోరారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర నాయకులు పెద్ది శ్రీనివాస్‌గౌడ్, నల్లమోతు సిద్ధార్థ, పట్టణ ముఖ్య నాయకులు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో త్రిపురారం విద్యార్థి ప్రతిభ

విద్యార్థిని అభినందిస్తున్న మర్ల చంద్రారెడ్డి

త్రిపురారం, డిసెంబర్ 4: మండల కేంద్రానికి చెందిన జెర్రిపోతుల లక్ష్మి, నాగయ్య దంపతుల కుమారుడు జెర్రిపోతుల మధు వెయిట్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబర్చాడు. గత నెల 28న అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో 73 కిలోల విభాగంలో ఆయన ప్రతిభ కనబర్చి బహుమతి అందుకున్నాడు. దాంతో పాటు అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి సోమవారం మధును అభినందించి రూ.20వేల ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా మధు తండ్రి నాగయ్య మాట్లాడుతూ తన కుమారుడు దేశం తరపున ఆడేందుకు వెళ్తున్నందుకు సంతోషంగా ఉందని, అందుకు దాతలు సహకరించాలని కోరారు. ప్రస్తుతం మధు మిర్యాలగూడలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు.

పరామర్శ

మాడ్గులపల్లి, డిసెంబర్ 4: మండల కేంద్రానికి చెందిన జాకంటి పెద్ద అంజయ్య సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. జడ్పీటీసీ పుల్లెంల సైదులు గ్రామానికి వెళ్లి అంజయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట నాయకులు కట్ట సిద్ధార్థరెడ్డి, వెంకన్నగౌడ్, నరేష్, పింగల్‌రెడ్డి ఉన్నారు.

ఆలయాల్లో కార్తిక సోమవారం పూజలు

- ముక్కంటికి పంచామృతాభిషేకాలు, రాత్రి దీపోత్సవం
- భక్తులతో ఆలయాలు కిటకిట

ఛాయా సోమేశ్వరాలయంలో భక్తుల పూజలు

రామగిరి, డిసెంబర్ 4: కార్తిక మాసంలో మాసంలో వచ్చే సోమవారానికి ఎంతో విశిష్టత ఉంటుంది. అందులో భాగంగా నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ముక్కంటి ఆలయాల్లో భక్తులు పరమశివుడికి పంచామృత, మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలు చేసి భక్తి భావం చాటారు. అలాగే రాత్రి నంద దీపం, పలు ఆలయాల్లో దీపోత్సవం చేశారు. జిల్లా కేంద్రంలోని పానగల్‌లోని అతి ప్రాచీనమైన ఛాయా సోమేశ్వరాలయంలో ఆలయ అభివృద్ధి కమిటి చైర్మన్ గంట్ల అనంతరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయడంతో భక్తులు పూజలు,అభిషేకాలు చేశారు. అలాగే పచ్చల సోమేశ్వర, వేంకటేశ్వర స్వామి, నల్లగొండ తులసీనగర్‌లోని కాశీవిశ్వేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. జిల్లాలోని ప్రసిద్ధ పార్వతీజడల రామలింగేశ్వర స్వామి ఆలయం చెర్వుగట్టు, మీనాక్షి అగస్త్యేశ్వర స్వామి ఆలయ వాడపల్లి, పానగల్ ఉదయం సముద్రంలో భక్తులు తెల్లవారుజామున నదీ స్నానాలు ఆచరించిన అనంతరం స్వామిని దర్శించుకున్నారు. దాంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో కిక్కిరిశాయి.

కార్తిక దీపాలు వెలిగిస్తున్న యువతులు

పార్టీని మరింత పటిష్ట పర్చుకుందాం

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరాజు

హాలియా, డిసెంబర్ 4: ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఓడిపోయినంత మాత్రాన పార్టీ నాయకులు, కార్యకర్తలు అధైర్యపడవద్దని ఆ పార్టీ రాష్ట్ర కార్య దర్శి శ్రీనివాసరాజు సూచించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి ప్రజలు దూరం కావడానికి గల కారణాలను విశ్లేషించుకొని కేసీఆర్ నాయకత్వం లో పార్టీని మరింత పటిష్ట పర్చుకునేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజాతీర్పును గౌరవించడంతో పాటు బాధ్యతాయుత ప్రతిపక్షంగా ఉంటూ రాష్ట్ర అభివృద్ధికి బీఆర్ఎస్ కట్టుబడి ఉం దని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో గెలుపో టములు సహజమన్నారు. ఎంపీ ఎన్నికల నాటికి బీఆర్ఎస్‌కి పూర్వవైభవం తీసుకువచ్చేలా నాయ కులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.

ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

కొండమల్లేపల్లి: దేవరకొండలోని సాయి రమ్య ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగే బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు రమావత్ దస్రూనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించడానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ హాజరుకానున్నట్లు చెప్పారు. మండలంలోని జడ్పీ టీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్ స భ్యులు, ఉప సర్పంచులు, బీఆర్ఎస్ సీనియర్, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ముమ్మరంగా వరి నాట్లు

మాడ్గులపల్లి, డిసెంబర్ 4: మండలంలో యాసంగి సీజన్ వరి సాగు ముమ్మరంగా సాగుతున్నది. సాగుకు 24 గంటల విద్యుత్ అందుతుండడంతో పాటు భూగర్భ జలాలు పుష్కలంగా ఉండడంతో బోరు బావుల కింద వరినాట్లు వేస్తున్నారు. ఈ సారి సాగర్‌కు సరైన ఇన్‌ఫ్లో లేక కాల్వద్వారా నీరందే అవకాశం లేక పోవడంతో రైతులందరూ బోర్ల కిందే సాగు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటికే వరినాట్లు ప్రారంభించగా మరికొంత మంది రైతులు ఆలస్యంగా ప్రారంభించారు. ప్రస్తుతం తుపాను ప్రభావంతో వర్షాలు కురుస్తుండడంతో రైతులు వరినాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు.

మాడ్గులపల్లిలో వరినాట్లు వేస్తున్న కూలీలు